


# కరపత్రం

SINCE 2014

సోమవారం ఆగస్ట్ 25 2025 | సంపుటి :0 | సంచిక :309 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

# గగన్‌యాన్ మిషన్..

## ఎయిర్ డ్రాప్ టెస్ట్ విజయవంతం

- గగన్‌యాన్ ప్రాజెక్టులో ఇస్రో మరో కీలక పరీక్షను విజయవంతంగా పూర్తి చేసింది.
- క్రూ మాడ్యూల్‌కి సంబంధించిన మొదటి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ ను నిర్వహించారు.
- ఈ పరీక్షలో భాగంగా, హెలికాప్టర్ సహాయంతో మాడ్యూల్‌ను ఎత్తుకు తీసుకెళ్లి, దాన్ని కిందకు జారవిడిచారు.

పేజ 2లో





# ఢిల్లీ సీఎంపై దాడి..

## వెలుగులోకి పలు భద్రతా లోపాలు!

దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా సివిల్ లైన్స్‌లోని తన అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ఆమెపై దాడి జరగడం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు జరిపిన అధికారులు రాజ్ నివాస్ మార్గ్‌లోని ఆమె అధికారిక నివాసంలో భద్రతా లోపాలను గుర్తించారు. నిందితుడు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన ఆటో డ్రైవర్ సకారియా రాజేశ్‌భాయ్ ఖిమ్జీభాయ్(41)గా గుర్తించి ఇదివరకే అదుపులోకి తీసుకున్నారు.

ఈ ఘటనపై విచారణ జరిపిన అధికారులు.. లోపాల కారణంగా 'పెను ప్రమాదం' సంభవించే అవకాశాన్ని ప్రస్తావించారు.


పేజ 2లో



## లైఫ్ సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ

# హబ్‌గా తెలంగాణ

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన ఆసియా-పసిఫిక్ బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్-2025లో పాల్గొన్నారు.
- బయోడిజైన్స్, లైఫ్ సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ రంగాలకు తెలంగాణ ఒక ముఖ్యమైన కేంద్రంగా ఎదుగుతోందని ఆయన తెలిపారు.
- 2047 నాటికి తెలంగాణను దేశంలో ఒక ముఖ్యమైన ఆర్థిక శక్తిగా మార్చడమే లక్ష్యంగా "తెలంగాణ రైజింగ్ 2047" నినాదంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు.
- సుల్తాన్‌పూర్‌లో భారతదేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైజ్ పార్కును ఏర్పాటు చేశామని, అక్కడ 60కి పైగా కంపెనీలు ఉన్నాయని వివరించారు.



హైదరాబాద్: బయోడిజైన్స్, లైఫ్ సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఒక ముఖ్యమైన కేంద్రంగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో ఆసియా-పసిఫిక్ బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్-2025 ఘనంగా జరిగింది. ఈ సమ్మిట్‌కు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బయోడిజైన్స్‌కు ఒక గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. తెలంగాణను 2047 నాటికి భారతదేశంలో ఒక ముఖ్యమైన ఆర్థిక శక్తిగా మార్చడమే లక్ష్యంగా "తెలంగాణ రైజింగ్ 2047" నినాదంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. 2047 నాటికి భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతుందని, అప్పటికి మన దేశం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

లైఫ్ సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ విభాగంలో తెలంగాణ హబ్‌గా మారిందని, సుల్తాన్‌పూర్‌లో భారత్‌లోనే అతిపెద్ద మెడికల్ డివైజ్ పార్కును ఏర్పాటు చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుల్తాన్‌పూర్ పార్కులో 60కి పైగా కంపెనీలు ఉన్నాయని, ఇక్కడ ఇంప్లాంటేషన్లు, వైద్య పరికరాలు తయారు చేస్తున్నారని చెప్పారు. మన సామర్థ్యం, తెలివితేటలను ప్రజల కోసం ఉపయోగించుకోవాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. దీనికి తోడు, పరిశోధనల కోసం ప్రభుత్వం మెడికల్ డేటాను కూడా అందిస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పుడు టారిఫ్‌లు, వ్యాపార సమస్యలు, యుద్ధాలతో ప్రపంచం సతమతమవుతున్నప్పటికీ, ఇది ఇన్నోవేటర్స్, స్టార్టప్‌లు ఏర్పాటు చేసుకోవడానికి సరైన సమయం అని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఆవిష్కరణలు, కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బిల్లు అంశాన్ని అమిత్ షా వద్ద ప్రస్తావించిన తెలంగాణ స్పీకర్

దిల్లీ: దిల్లీలో జరుగుతున్న స్పీకర్ల సదస్సులో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ప్రారంభోపన్యాసం తర్వాత తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసి బీసీ రిజర్వేషన్ల బిల్లు అంశాన్ని ప్రస్తావించారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లు ఇంకా కేంద్రం వద్ద పెండింగ్‌లోనే ఉందని స్పీకర్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రత్యేకంగా మిమ్మల్ని కలిశారని గుర్తు చేశారు. బీసీ బిల్లు విషయం చూస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో అమిత్ షా అన్నట్టు సమాచారం.



## తెలంగాణలో బీజేపీ గెలిచిన 8 MP సీట్లు దొంగ ఓట్లే: పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్



కరీంనగర్: తెలంగాణలో బీజేపీ గెలిచిన 8 ఎంపీ సీట్లు దొంగ ఓట్లతో గెలిచినవేనని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కూడా దొంగ ఓట్లతోనే గెలిచారని.. వాస్తవానికి కరీంనగర్ లో బండి సంజయ్ గెలిచే పేస్ కాదని హాట్ కామెంట్స్ చేశారు. బండి సంజయ్ తెల్లారి లేస్తే బీసీ అని చెప్పుకుంటారని.. మరీ బీసీ రిజర్వేషన్ల కోసం ఆయన ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్‌ని తొలగిస్తే ఒక బీసీగా తాను గొంతెత్తానని..

2లో▸

## భారత రాష్ట్ర సమితి ఇప్పటికే మూడు ముక్కలైంది: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



2లో▸

## శ్రీశైలానికి స్థిరంగా కొనసాగుతున్న వరద..

# 10 గేట్లు ఎత్తి నీటి విడుదల

సున్నిపెంట: శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 4,71,386 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 5,05,150 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేల క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 21,775 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 10 స్పిల్‌వే గేట్లను 18 అడుగుల మేర ఎత్తి 4,18,060 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 881.50 అడుగుల మేర నీరు ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలకు గానూ.. ప్రస్తుతం 196.11 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



## వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం..

# ఉత్తరాంధ్రకు వర్ష సూచన



అమరావతి: ఐఎండీ సూచనల ప్రకారం వాయవ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమబెంగాల్ తీరాలకు ఆనుకుని సోమవారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు ఉత్తరాంధ్రలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర తీరం వెంబడి ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్స్ వద్ద ఉండరాదని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ పొంగిపొర్లే వాగులు, కాలువలను దాటే ప్రయత్నం చేయరాదన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఆగస్ట్ 25 2025

# సంపాదకీయం

## ఓయూ పునర్వైభవం కోసం కలిసి నడుద్దాం..

దేశంలో తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాలు మొదలు ఎన్నో విశ్వవిద్యాలయాలు సమాజాభివృద్ధిలో కీలక భూమిక పోషించాయి. 108 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఔన్నత్యం గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. ఆయా రంగాల్లో అత్యంత క్రియాశీలక మేధావులను, నాయకత్వాన్ని అందించి ప్రపంచ చరిత్రలోనే ఉస్మానియా విశ్వవిద్యాలయం తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత ఎన్నో విశ్వవిద్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఫలితంగా సామాన్యులు సైతం విద్య, పరిశోధనల్లో భాగస్వాములయ్యే అవకాశాలు దక్కాయి. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ, ఐటీ విప్లవంతో కూడిన ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను కాపాడుకునే బాధ్యత మనందరిది. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత పేరు ప్రఖ్యాతి కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం... ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నాయకత్వం వహించాల్సి ఉంటుంది. విశ్వవిద్యాలయం నాయకత్వం వహించటమంటే.... ఈ నేల, ఈ గాలి, ఈ జ్ఞాన నిధికి వారసులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావటం. ఓయూ నుంచే ఎదిగిన ఓ ప్రపంచస్థాయి తత్వవేత్త పద ప్రయోగం చేసినట్లు... ఓయూ క్యాచ్‌మెంట్ ఏరియా పరిధిలోకి వచ్చే, అంటే ఓయూతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపైనా ప్రభుత్వ రంగ విద్యను కాపాడుకునే బాధ్యత ఉంది. పేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చే చురుకైన, మేధోసంపత్తి కలిగిన విద్యార్థులకు ఆదెరువుగా ఉన్న ఉస్మానియా లాంటి విశ్వవిద్యాలయాల పురోగతి అనివార్యం. ఆధునిక ప్రపంచ గమనంలో ఏర్పాటైన ప్రైవేటు విశ్వవిద్యాలయాల పోటీని ఎదుర్కొని నిలవాలంటే.... సమకాలీన స్థితిగతులకు అనుగుణంగా ఆలోచన, కార్యాచరణ మనదగ్గరుండాలి. ప్రభుత్వాలు సహా భాగస్వాములందరినీ కలుపుకుని ప్రైవేటుకు దీటుగా మన విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేసుకోవాలి. ప్రపంచీకరణ తర్వాత ప్రభుత్వరంగ విద్యకు అనేక పరిమితులు ఏర్పడ్డాయి. మారుమూల పల్లెల్లోనూ ప్రైవేటు విద్య అందుబాటులోకి వచ్చింది. ఉన్నత విద్య పేదలకు అందకుండా పోయే ప్రమాదం సమీప భవిష్యత్తులోనే ఉంది. ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులోనూ ప్రభుత్వ విద్య అందుబాటులో ఉండాలంటే.... ప్రస్తుత ఆధునిక సమాజంలో ప్రభుత్వరంగ విశ్వవిద్యాలయాలను కాపాడుకునేందుకు ఓ వ్యూహం, ఎత్తుగడ అవసరం.

విశ్వవిద్యాలయాలు మేధో చర్చకు నిలయాలుగా ఉండటం చరిత్ర నేర్పిన పాఠం. యూజీసీ నిబంధనావళి ప్రకారం విశ్వవిద్యాలయాల పరిశోధనల ఫలితాల ద్వారా ప్రభుత్వ పథకాలను రూపొందించుకోవాలని ఎన్నోసార్లు ఉద్ఘాటించారు. కనుక మన చర్చలన్నీ నిర్మాణాత్మకంగానే ఉండాలి. కానీ, కొన్ని సందర్భాలలో కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు ముందూ వెనకా ఆలోచించకుండా.... ఆవేశకావేశాలకు లోనుకావటం ద్వారా ప్రస్తుత పరిస్థితుల్లో విశ్వవిద్యాలయాల దిశను మార్చలేము. ఈ సందర్భంలో తన సాహిత్యానికి నాలుగుసార్లు పులిట్జర్ బహుమతి పొందిన అమెరికన్ రచయిత రాబర్ట్ ఫ్రాస్ట్ చెప్పిన... "విద్య అంటే మీ కోపాన్ని లేదా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవటం కాదు, ఏదైనా వినయంతో వినగల సామర్థ్యాన్ని కలిగి ఉండటం" అనే మాటలు గుర్తొస్తున్నాయి. రాజకీయ కారణాలు, వ్యక్తిగత అవసరాలతో చేసే నినాదాల పట్ల విద్యార్థులు, పరిశోధకులు అప్రమత్తంగా ఉండాలి. వాస్తవిక విషయాలను అర్థం చేసుకుని మసలుకోవాల్సిన అవసరాన్ని గుర్తెరగాలి. గుడ్డిగా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకత్వాన్ని అడ్డుకోవడం, వ్యతిరేకంగా నినదించటం వల్ల జరిగే నష్టాన్ని అర్థం చేసుకోవాలి. ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకించడమంటే ప్రభుత్వ యంత్రాంగాన్ని బహిష్కరించటం కాదు. తద్వారా జరగాల్సిన మేలు కన్నా కీడే ఎక్కువ. అయితే.. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపేందుకు వేరే పద్ధతులున్నాయి. రాజకీయంగా ఏవైనా భిన్నాభిప్రాయాలుంటే అందుకు వేరే వేదికలను వినియోగించుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర విద్యావ్యవస్థకు దిక్సూచిగా, పెద్దన్నగా ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిస్థితి గురించి మనం ప్రత్యేకంగా చర్చించుకోవాలి. ప్రతి సందర్భంలోనూ 'రాజకీయ నాయకత్వాన్ని అడ్డుకుంటాం, బహిష్కరిస్తాం' లాంటి నినాదాలు గత పదేళ్లలో ఎక్కువగా విన్నాం. ఇలాంటి వ్యాఖ్యలు ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్ల సమాజంలో తప్పుడు అభిప్రాయాన్ని కల్గించే అవకాశం ఉంది. ఇది జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లు, న్యాక్ గుర్తింపుపై ప్రభావం చూపుతుంది. విదేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో సీటు పొందాలంటే ఇప్పుడున్న ప్రమాణాల ప్రకారం మన దేశంలోని విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లను, న్యాక్ గుర్తింపులను ప్రమాణంగా తీసుకుంటారు. ఫలితంగా ఇక్కడ చదువుకునే తెలంగాణ భూమి పుత్రుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునే ప్రమాదం ఉంది.

ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తిరిగి పునర్వైభవం తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ పౌర సమాజంపై ఉంది. వర్సిటీ పరిధిలో ఉన్న 730కి పైగా కళాశాలల్లో మూడున్నర లక్షల మంది విద్యార్థులు దాదాపు 175 విభిన్న కోర్సుల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. వారి బంగారు భవిష్యత్తుకోసం అవసరమైన నైపుణ్యాలను పెంపొందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఇందుకోసం విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఓ కార్యాచరణతో ముందుకు వెళ్లాలి. ప్రభుత్వాలను భాగస్వామ్యం చేస్తూ ఓయూను అభివృద్ధి పథంలో నడిపించే పంథాను అనుసరించాలి. ఇప్పటికే పదమూడేళ్లుగా బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు లేక రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రభుత్వ సహకారంతో అధిగమించాలి. ఏటికేడు ఆచార్యుల పదవీ విరమణలతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో క్రమేణా అధ్యాపకుల సంఖ్య ఐదో వంతుకు చేరింది. అవసరం మేరకు సదుపాయాలు లేక సమాజ సమగ్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు కొంత వెనకబడ్డా.. ఆధునిక పోటీని తట్టుకుని నిలబడగలిగాయి. క్లిష్ట పరిస్థితుల్లోనూ జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగుల్లో ఉస్మానియా తనదైన స్థాయిని దక్కించుకుంది. ఇక్కడి అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థుల కృషి, పట్టుదలే ఇందుకు కారణం. వారు పరిమిత వనరులతోనే పోటీ ప్రపంచాన్ని నెగ్గుకుంటూ అత్యుత్తమ ఉద్యోగాలు పొందుతున్నారు. అయితే.. ప్రస్తుత ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో నియామకాలకు పచ్చజెండా ఊపటంతో పాటు అధ్యాపకుల పదవీవిరమణ వయస్సు 65 ఏళ్ళకు పెంచటం శుభపరిణామం. ఈ ఆర్థిక సంవత్సరానికి ఒక్క ఓయూకే రూ.542 కోట్ల బ్లాక్ గ్రాంట్‌తో పాటు మౌలికవసతుల కల్పనకు రూ.100 కోట్లు అదనంగా కేటాయించటం ద్వారా ఉన్నత విద్య పట్ల ప్రభుత్వ విధానం స్పష్టమైంది. ఈ సందర్భంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు విశ్వవిద్యాలయాల్లో పర్యటించటం ద్వారా మౌలికవసతుల కల్పనకు అవకాశం ఏర్పడింది.ఏ దేశ అభివృద్ధి కొలమానమైనా ఆ దేశ విద్యావ్యవస్థ నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. మెరుగైన, నాణ్యమైన, నైపుణ్యాలతో కూడిన విద్యావ్యవస్థ కలిగిన దేశాలు, ప్రాంతాలు సమగ్రాభివృద్ధిలోనూ ముందు వరుసలో ఉంటాయి. అందుకే రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు కోసం తపిస్తున్న ముఖ్యమంత్రి ఉస్మానియా విశ్వవిద్యాలయ పర్యటనను స్వాగతిద్దాం. రానున్న కాలంలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దే బృహత్తర కార్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్నీ భాగస్వామ్యం చేద్దాం.

# గగన్‌యాన్ మిషన్..

## ఎయిర్ డ్రాప్ టెస్ట్ విజయవంతం

మొదటి పేజీ తరువాయి

భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ అంతరిక్ష ప్రాజెక్టులో ఇస్రో మరో ముందడుగు వేసింది. క్రూ మాడ్యూల్‌కు సంబంధించిన తొలి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్టు ను విజయవంతంగా నిర్వహించింది. వాయుసేన, నౌకాదళం, డీఆర్డీవో, కోస్ట్‌గార్డ్‌ల సంయుక్త సహకారంతో ఈ పరీక్షలు చేపట్టింది.

ఈ ప్రయోగంలో భాగంగా మాడ్యూల్ నమూనాను హెలికాప్టర్ సాయంతో నింగిలోకి తీసుకెళ్లి.. కిందికి జారవిడిచారు. పారాచూట్ల సాయంతో ఆ మాడ్యూల్ వేగాన్ని తగ్గించుకుంటూ. సముద్ర జలాల్లో సురక్షితంగా దిగింది. మానవసహిత అంతరిక్ష ప్రయోగాల సమయంలో వ్యోమగాములు భూమికి సురక్షితంగా తిరిగి వచ్చేందుకు దీన్ని ఉపయోగిస్తారు. మాడ్యూల్ భూవాతావరణంలోకి ప్రవేశించిన అనంతరం దాని వేగ నియంత్రణ, ల్యాండింగ్ విషయంలో పారాచూట్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. సంక్లిష్టమైన ఈ వ్యవస్థ పనితీరును పరీక్షించడమే లక్ష్యంగా ఈ ప్రయోగం చేపట్టినట్లు సమాచారం.

భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో చేపట్టిన గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఇస్రో అనేక పరీక్షలు నిర్వహిస్తోంది. జులైలో సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్(%వాఫీూా%)కు సంబంధించి రెండు హాట్ టెస్టులను విజయవంతంగా చేపట్టింది. 2027లో తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఇటీవల వెల్లడించారు.

# దిల్లీ సీఎంపై దాడి..

## వెలుగులోకి పలు భద్రతా లోపాలు!

మొదటి పేజీ తరువాయి

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా హోం మంత్రిత్వ శాఖకు నివేదికను సమర్పించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ దాడి తర్వాత సీఎం రేఖా గుప్తాకు కేంద్ర ప్రభుత్వం జెడ్ కేటగిరీ భద్రతను కల్పించింది. ఇందులో 20-22 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది ఆమెకు భద్రతకు కల్పిస్తారని అధికారులు 'ఈటీవీ భారత్'కు తెలిపారు. నిరంతరం ఆమెకు రక్షణ కల్పించడానికి అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు.

**కాంప్లెక్స్‌లోకి వెళ్లడానికి, రావడానికీ ఒక్కటే గేటు**

రెండు నెలల కిందట, సీఎం రేఖాగుప్తాకు 1/8 , 2/8 రాజ్ నివాస్ మార్గ్‌లో రెండు బంగ్లాలు కేటాయించారు. అందులో ఆమె ఒకదాన్ని తన నివాసంగా, మరొకటి క్యాంప్ కార్యాలయంగా ఉపయోగిస్తున్నారు. ఈ కాంప్లెక్స్‌లో మరో రెండు బంగ్లాలు కూడా ఉన్నాయి. వాటిని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి రవి ఇంద్రరాజ్ సింగ్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్‌లకు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. నాలుగు బంగ్లాలకు ప్రవేశించడానికి, బయటకు వెళ్లేందుకు మార్గం ఒక్కటే ఉండటం ప్రధాన భద్రతా లోపం అని అధికార వర్గాలు పేర్కొన్నాయి. నివేదికలో వెలుగులోకి వచ్చిన మరో లోపం ఏమిటంటే.. సిబ్బంది, అక్కడికి వచ్చే సందర్శకులు ఒకే మార్గాన్ని ఉపయోగించడం. దీంతో ప్రతి ఒక్కరినీ నిశితంగా పరిశీలించడం కష్టంగా మారిందని ఆయా వర్గాలు పేర్కొన్నాయి. భాజపా ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ గోయల్ దీనిపై స్పందించారు. నిర్మాణ సంబంధిత సమస్యలను కూడా ఎత్తి చూపారు. కాంప్లెక్స్ ప్రహారీ గోడ ఎత్తు చాలా తక్కువగా ఉందన్నారు. ఎవరైనా సులభంగా లోపలికి దూకే విధంగా ఉందని తెలిపారు. "కాంప్లెక్స్‌కు మూడు వైపులా ప్రైవేట్ అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. భద్రతా సిబ్బంది నిరంతరం నిఘా నిర్వహించడం కష్టతరంగా మారింది" అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నివాసం చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ కెమెరాలను కూడా అప్‌డేట్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అన్ని రాష్ట్రల మాదిరిగా దిల్లీ ముఖ్యమంత్రికి శాశ్వత నివాసం లేదన్నారు. రేఖా గుప్తా బంగ్లా టైప్-7 అని, సాధారణంగా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేటాయించే టైప్-8 ఇళ్ల కంటే కాస్త చిన్నదిగానే ఉంటుందని అధికారులు తెలిపారు.

## భారత రాష్ట్ర సమితి ఇప్పటికే మూడు ముక్కలైంది: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

మొదటి పేజీ తరువాయి

చొప్పదండి: కులం, మతం లేనిదే భాజపా నేతలు రాజకీయం చేయలేరని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. కరీంనగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ దొంగ ఓట్లతో గెలిచినట్లు అనుమానంగా ఉందని వ్యాఖ్యానించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో నియోజకవర్గంలో కొనసాగుతున్న కాంగ్రెస్ రెండోదశ జనహిత పాదయాత్రలో ఆయన మాట్లాడారు.

"బీసీల గురించి బండి సంజయ్ ఒక్క మాట కూడా మాట్లాడరు. భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి ఆయన్ను తొలగించినపుడు మేం మాట్లాడాం. బీసీ బిల్లుకు ఇకనైనా భాజపా నేతలు మద్దతివ్వాలి. వచ్చే ఎన్నికల నాటికి రాజకీయ ముఖచిత్రంలో భారత రాష్ట్ర సమితి ఉండదు. ఆ పార్టీ ఇప్పటికే మూడు ముక్కలైంది. ఓట్ల చోరీతోనే మోదీ మూడో సారి అధికారంలోకి వచ్చారు" అని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు.

ఒక బీసీ బిడ్డను అధ్యక్ష పదవి నుంచి ఎలా తొలగిస్తారని బీజేపీని ప్రశ్నించానని గుర్తు చేశారు.

## తెలంగాణలో బీజేపీ గెలిచిన 8 MP సీట్లు దొంగ ఓట్లే: పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

మొదటి పేజీ తరువాయి

ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తుంటే బండి సంజయ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. భవిష్యత్ బీసీ తరాలకు ఒక బీసీ బిడ్డగా బండి సంజయ్ అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. మేం దేవుడిని నమ్ముతాం కానీ దేవుడి పేరుతో ఎప్పుడూ ఓట్ల అడగలేదని బీజేపీపై ఫైర్ అయ్యారు. ఎన్నికలప్పుడు దేవుడు.. గెలిచిన తర్వాత హిందూ-ముస్లిం గొడవలు పెట్టి పబ్బం గడుపుతారని కమలం పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదివారం ( ఆగస్టు 24 ) కరీంనగర్‌లో రెండో విడత జనహిత పాదయాత్ర ప్రారంభించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్యక్షతన ప్రారంభమైన ఈ పాదయాత్రలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. మన భవిష్యత్ కోసమే ఈ జనహిత పాదయాత్ర అని.. ప్రజల కష్టాలు తెలుసుకోవడానికే ఈ పాదయాత్ర చేపట్టామని తెలిపారు.

కాంగ్రెస్ ఒక్కసారి మాట ఇస్తే తప్పకుండా నేరవేర్చి తీరుందన్నారు. రాష్ట్రంలో ఎన్నో అద్భుత పథకాలు కాంగ్రెస్ అమలు చేస్తోందని, రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తారని కలలోనైనా ఊహించామా అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలు కూడా సన్న బియ్యం అన్నం తినాలనే ఉద్దేశంతో రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఇక, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, ఆ పార్టీ రాష్ట్రంలో లేదన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ ఉన్నది మతపిచ్చి పార్టీ బీజేపీ మాత్రమేనని అన్నారు.

## తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా గణేశ్, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అనుమతి తీసుకున్న మండపాలకు ఉచిత విద్యుత్ అందించనున్నారు. ఈనెల 27 నుంచి గణేశ్ ఉత్సవాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లో గణేశ్ మండపాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రాముఖ్యత పొందిన ఖైరతాబాద్ గణనాథుడిని విగ్రహ నిర్మాణం తుది దశకు చేరుకుంది.

## 'ఆ సూచన నాకూ వర్తిస్తుంది'.. పెళ్లిపై రాహుల్ గాంధీ సరదా వ్యాఖ్యలు

తన పెళ్లి విషయంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సరదా వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై ఆర్జేడీ అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్ తో మాటామంతీ కొనసాగుతోందని తెలిపారు. 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా బిహార్‌లోని అరారియాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, రాహుల్ గాంధీ మధ్య ఈమేరకు సంభాషణ సాగింది.

సమావేశంలో భాగంగా తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి, ఎల్‌జేపీ (రామ్‌విలాస్) నేత చిరాగ్ పాసవాన్ ఇక పెళ్లి చేసుకోవాలంటూ సూచించారు. ఈ క్రమంలోనే పక్కనే కూర్చున్న రాహుల్ గాంధీ వెంటనే మైక్ అందుకుని.. 'ఈ సూచన నాకూ వర్తిస్తుంది.' అని వ్యాఖ్యానించారు. 'ఇదే విషయాన్ని మా నాన్న ఎప్పటినుంచో చెబుతున్నారు కదా' అని తేజస్వీ బదులిచ్చారు. 'అవును.



దీనిపై ఆయనతో చర్చలు కొనసాగుతున్నాయి' అని రాహుల్ బదులిచ్చారు. ఈ సరదా సంభాషణతో అక్కడ నవ్వులు విరబూశాయి.

ఓనం పండుగకి... మోనాలిసా ఆహ్వానిస్తే!

రాహుల్ గాంధీ పెళ్లిపై రెండేళ్ల క్రితం పట్నాలో లాలూప్రసాద్ యాదవ్ తనదైన శైలిలో నవ్వులు పూయించిన సంగతి తెలిసిందే. "మా మాట విను.. పెళ్లి చేసుకో. మేమంతా నీ బరాత్‌కు రావాలనుకుంటున్నాం. వివాహానికి విముఖత చూపుతుండటంతో మీ అమ్మ (సోనియా గాంధీ) ఆందోళన చెందుతోంది" అని వ్యాఖ్యానించారు. తాజా సమావేశంలో ఇదే విషయాన్ని రాహుల్ ప్రస్తావనకు తీసుకొచ్చినట్లు సమాచారం.

## చట్టసభలు.. ప్రజా సమస్యలపై చర్చించడానికే గానీ.. రాజకీయ లబ్ధికి కాదు: అమిత్ షా

దిల్లీ: చట్ట సభలు.. ప్రజాసమస్యలపై చర్చలు జరపడానికే గానీ.. రాజకీయ లబ్ధి పొందేలా వ్యవహరించడానికి కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. దిల్లీలో జరుగుతున్న 'ఆల్ ఇండియా స్పీకర్స్ సమావేశం'లో కేంద్రమంత్రి పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌లో జరిగే చర్చలు దేశాభివృద్ధిని ప్రభావితం చేస్తాయని చెప్పారు.

"చర్చలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు విపక్షాల కారణంగా సజావుగా జరగలేదు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. దీని గురించి ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆలోచించాలి. అర్థవంతమైన చర్చలు జరగాలి. సభా గౌరవాన్ని, స్పీకర్ పదవి గౌరవాన్ని పెంపొందించడానికి కృషి చేయాలి.



ప్రజాసమస్యలపై నిష్పాక్షపాతమైన చర్చలు జరపడానికి చట్ట సభలను వేదికగా మార్చుకోవాలి. వాటి నిబంధనల మేరకు సమావేశాలు జరిగేలా చూడాలి"అని అన్నారు.

సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి తొలి భారతీయ స్పీకర్‌గా పనిచేసిన విఠల్‌భాయ్ పటేల్‌కు కేంద్రమంత్రి అమిత్ షా నివాళులర్పించారు. వందేళ్ల క్రితం స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికతోనే దేశంలో పార్లమెంటరీ చరిత్ర మొదలైందన్నారు. అప్పటి బ్రిటిష్ పాలనలో 1919 డిసెంబర్ 24న దేశంలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఏర్పాటైంది. 1925లో విఠల్‌భాయ్ పటేల్ ఈ సభకు స్పీకర్‌గా ఎన్నికయ్యారు.

## పారిపోయేందుకు నొయిడా నిందితుడి యత్నం.. కాళ్లపై కాల్పులు జరిపిన పోలీసులు

అదనపు కట్నం కోసం తల్లిదండ్రులతో కలిసి..భార్యను తీవ్రంగా కొట్టి నిప్పంటించి కేసులో నొయిడాకు చెందిన విపిన్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సీన్ రీకన్‌స్ట్రక్షన్‌కు తీసుకువెళ్తుండగా సిర్సా చౌరాహా సమీపంలో పోలీసుల నుంచి గన్ లాక్కొని, పారిపోవడానికి ప్రయత్నించినట్లు తెలిపారు. వెంటనే అతడి కాలిపై కాల్చి..అదుపులోకి తీసుకున్నామన్నారు.

భార్యను చంపాననే పశ్చాత్తాపం విపిన్‌లో ఏమాత్రం కనిపించట్లేదని పోలీసులు పేర్కొన్నారు. తన భార్యను తాను హత్య చేయలేదని..ఆమే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుందని నిందితుడు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. భార్యాభర్తల గొడవలు సాధారణ విషయాలని..ఈ





మాత్రం దానికే నిక్కీ ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏముందంటూ తిరిగి తమనే ప్రశ్నిస్తున్నాడన్నారు. హత్య అనంతరం బంధువులను, పోలీసులను తప్పుదారి పట్టించేందుకు విపిన్ ప్రయత్నించినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఆమెతో ఉన్న ఫొటోలు షేర్‌చేసి..'ఆత్మహత్య చేసుకొని..నన్నెందుకు ఒంటరిగా వదిలి వెళ్లిపోయావ్' అంటూ పోస్టులు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన వీడియో ఆధారంగా అతడిని అరెస్టు చేశామన్నారు.మెర్సిడెస్ కారు ఇవ్వలేదనే..వివాహ సమయంలో కట్నంగా కారు, నగదు, విలువైన వస్తువులు ఇచ్చినప్పటికీ నిక్కీ భర్త విపిన్, అతడి తల్లిదండ్రులు అదనపు కట్నం కోసం హింసించేవారని మృతురాలి తండ్రి పేర్కొన్నాడు. ఇటీవల తాను మెర్సిడెస్ కారు కొనుగోలు చేశానని..నాటి నుంచి తమకు కూడా అదే కారు ఇప్పించాలని విపిన్ పలుమార్లు ఒత్తిడి తీసుకువచ్చాడన్నారు. ఈ నేపథ్యంలోనే అదనపు కట్నం కోసం ఈ దారుణానికి పాల్పడ్డాడని వాపోయారు. నిందితులకు కఠిన శిక్ష విధించేలా అధికారులను ఆదేశించాలని సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కోరారు.నొయిడాకు చెందిన నిక్కీ అనే మహిళను గురువారం అదనపు కట్నం కోసం ఆమె భర్త, అత్త తీవ్రంగా కొట్టి..పెట్రోల్ పోసి నిప్పంటించారు. తీవ్రంగా కాలిన గాయాలతో ఉన్న బాధితురాలిని స్థానికుల సహాయంతో ఆమె సోదరి ఆస్పత్రికి తరలించగా అప్పటికే నిక్కీ ప్రాణాలు కోల్పోయింది. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# భారత రాజ్యాంగాన్ని తప్పుగా ఉపయోగించి

# ప్రజాహక్కులను తృణీకరించడం ఒక భావజాలమా?

**● జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారి అభ్యర్థిత్వ ప్రకటనతో స్వతంత్ర సాధువు చరిత్ర లోకానికి తెలిసింది**

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

మన దేశ ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతున్నది. దీని కొరకు పాలక ఎన్డీఏ తమ అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్ ను ప్రకటించింది.ప్రతిపక్ష పార్టీలు తరపున జస్టిస్ సుదర్శన్ రెడ్డిని తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రంగంలోకి దించాయి.

**● జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరు ప్రకటనతో ఇప్పుడు ప్రతిపక్ష పార్టీల గత చరిత్ర తాలూకు కుట్ర బయటపడింది**

జస్టిస్ సుదర్శన్ రెడ్డి పై భారత హోం శాఖ మంత్రి అమిత్ షా కేరళలో చేసిన ప్రకటన ఇప్పుడు ప్రజల ఆలోచనలను తాజాగా మార్చింది.

## ● జస్టిస్ సుదర్శన్ రెడ్డి భావజాలం ఏమిటి?

తనకు తాను ఉదార రాజ్యాంగ ప్రజాస్వామ్యవాదిగా ప్రకటించుకోవడానికి జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు పడుతున్న తాపత్రయం నవ్వును,బాధను కలిగిస్తున్నది.జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వ ప్రకటన నాటి ఘోర సంఘటన కపట నాటకాన్ని మళ్ళీ ఒకసారి బయట పెట్టింది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి వ్యక్తిత్వం, పనితీరు అర్థం కావడానికి కేవలం రెండు తీర్పులు చాలు.అందులో మొదటిది ముఖ్యమైనది భోపాల్ గ్యాస్ సంఘటన.


**● భోపాల్ గ్యాస్ దుర్ఘటన ఏమిటి?**

1984 సంవత్సరం డిసెంబర్ మూడవ తేదీన మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నగరంలో యూనియన్ కార్బైడ్ అనే ఒక రసాయనిక పరిశ్రమలో విష వాయువు అయిన గ్యాస్ లీక్ జరిగింది.
ప్రపంచ పారిశ్రామిక రంగం చరిత్రలో ఇది అతి పెద్ద మానవ సంహారం.
ఇది భారత్ ప్రజలపై జరిగిన జెనోసైడ్ అని పిలువవచ్చు.
అప్పుడు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నడుస్తున్నది. ఈ యూనియన్ కార్బైడ్ అనే సంస్థ అమెరికాకు చెందినది. ఈ పరిశ్రమ అధిపతి వారెన్ అండర్సన్ ను రాత్రికి రాత్రి ప్రత్యేక విమానంలో అమెరికాకు పంపించింది అప్పటి రాజీవ్ గాంధీ కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం. ప్పుడు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో, కేంద్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వాలు. గుట్టు చప్పుడు కాకుండా కాంగ్రెస్ చేసిన కుట్రను కప్పి పెట్టిన ఘనుల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు కూడా ఒక పాత్రధారి అనే ఆరోపణలకు ఇప్పుడు బలం చేకూరుతున్నది.

**● భోపాల్ విషవాయువు లీక్ అయిన రోజు స్పాట్ లో 8 వేల మంది, రెండవ రోజు 8 వేల మంది. రెండు రోజుల్లో మొత్తం 16 వేలమంది ప్రజలు చనిపోయారు. ఈ మరణాల సంఖ్య 25 వేలకు చేరింది. ఇవి అధికారిక లెక్కలు.ప్రభుత్వ లెక్కల ప్రకారం అదనంగా 40000 మంది ప్రజలు విపరీతమైన ప్రమాదానికి, అనారోగ్యాలకు, కష్ట నష్టాలకు లోనయ్యారు. మొత్తంగా ఐదు లక్షల మంది ప్రజలు ఈ విషవాయువు దుర్ఘటనతో సర్వనాశనమయ్యారు. ఈ విష వాయువు ప్రమాదం ఒక అణుబాంబు లాంటి వినాశనాన్ని కలిగించింది**

ఈ దుర్ఘటనకు కారణమైన వారిది ఏ భావజాలం?.అందులో పాత్రధారులది ఏ భావజాలం? వారిని కాపాడడానికి ప్రయత్నించిన వారిది ఏ భావజాలం?.
జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉదారవాదము, రాజ్యాంగ వాదం ప్రజాస్వామ్య వాదం అంటూ ఇప్పుడు ప్రకటనలు చేస్తే చరిత్ర మాసిపోతుందా?
భోపాల్ విషవాయువు బాధితులు తమకు న్యాయం జరగలేదంటూ సుప్రీంకోర్టు తలుపు తడితే, మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేస్తే జరిగిందేమిటి?.




ఎన్డీయే, ఇండియా కూటములతో పాటు పలు ప్రాంతీయ శక్తులకు చెందిన ఎంపీలం దరి మద్దతునూ అభ్యర్థిస్తాను. ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేది రాజకీయ పార్టీలు కాదు. గౌరవ పార్లమెంటు సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీ. మీ విచక్షణ శక్తిని వినియోగించి ఓటేయండని ప్రతి ఒక్క ఎంపీకీ లిఖిత అభ్యర్థన పంపుతున్నాను.
ఈనాడు..24 ఆగస్ట్ 2025
♦ ఉపరాష్ట్రపతి ఎన్నికలో పోటీ జరుగుతున్నది నాకు, ఎన్డీయే అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్‌కూ మధ్య కాదు. ఇది రెండు భావజాలాల మధ్య జరుగు తున్న పోటీ. నా ప్రత్యర్థి అచ్చంగా ఆరెస్సెస్ మనిషి. నేను ఆ భావజాలా నికి చాలా దూరం. నేనొక ఉదార రాజ్యాంగ ప్రజాస్వామ్య వాదిని. ప్రజా

చట్టం పేరుతో, రాజ్యాంగం పేరుతో, ఉదారవాదం పేరుతో, ప్రజాస్వామ్యం పేరుతో ఈ మానవ సంహారాన్ని చులకనగా చూసిన రాజ్యాంగ పీఠంలో ఉన్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారిది ఏ భావజాలం?. భోపాల్ గ్యాస్ దుర్ఘటన ను చరిత్రలో కనుమరుగు చేసినందుకు కాంగ్రెస్ తన మిత్రపక్షాలను ఉపయోగించుకుని ఇప్పుడు ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటింపజేసి రుణం తీర్చుకుంటున్నదా అని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## ● ఇక రెండవ విషయం సల్వా జుడుం పై తీర్పు.

– సల్వా జుడుం తీర్పు సంగతేమిటి?
జస్టిస్ సుదర్శన్ రెడ్డి సుప్రీం కోర్టు జస్టిస్ గా పనిచేస్తున్న కాలంలో, 2011 సంవత్సరంలో సల్వా జుడుంను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును క్షుణ్ణంగా ఒకసారి చదవాలని అమిత్ షా కు సూచించిన జస్టిస్ సుదర్శన రెడ్డి గురించి ఇప్పుడు చర్చ మొదలైంది.
సుప్రీం కోర్టులో కేసు వేసిన నందినీ సుందర్, ఆ కేసు వాదించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ది ఏ భావజాలమో సామాన్యులకు కూడా తెలుసు.
వీరంతా లెఫ్ట్ లిబరల్ భావజాల ప్రతినిధులు, అన్న విషయం బహిరంగ రహస్యం.

– సుప్రీం కోర్టు సూపర్ పవర్ గా, ఎగ్జిక్యూటివ్ విధులు నిర్వహిస్తూ ఇస్తున్న తీర్పులు రాజ్యాంగ బద్ధమేనా అని న్యాయకోవిధులు, ప్రజాస్వామ్య వాదులు బహిరంగంగా గొంతెత్తుతున్నారు

శాంతి భద్రతలను, దేశ సార్వభౌమత్వాన్ని సవాల్ చేస్తున్న మావోయిస్ట్ నక్సలైట్ల ను ఎదుర్కొని పాలన చేయాల్సిన బాధ్యత రాష్ట్రాల ప్రభుత్వాలది, కేంద్ర ప్రభుత్వానిది.ప్రభుత్వాల ఎగ్జిక్యూటివ్ విధులను,నిర్ణయాలను కాలరాచే తీర్పుల వల్ల పాలన కుంటుపడదా?
ప్రజా శాంతిని ఎలా రక్షించాలి?.
జస్టిస్ సుదర్శన్ రెడ్డి నిన్న బహిరంగంగా ప్రకటించినట్టు ఈ తీర్పులు కోర్టులు ఇచ్చినవి అని సరిపుచ్చుకోవాలా?..
ఈ తీర్పుల వెనక ఉన్నది ఎవరు?..
ఉదార,రాజ్యాంగ, ప్రజాస్వామ్య భావజాలం కలిగిన వారని సరిపుచ్చుకుని దేవుడిపై భారం వేసి పాలన కొనసాగించాలా?...
కోర్టులు,రాజ్యాంగ వ్యవస్థలు తమకు తామే నడుస్తాయా? ఈ వ్యవస్థలను నడిపే వ్యక్తుల వైఖరి, ప్రవర్తన రాజ్యాంగ వ్యవస్థలపై ప్రభావం చూపవా?.

– **కచ్చితంగా చూపుతాయి**
రాజ్యాంగం మన దేశ ఆత్మ.
రాజ్యాంగం, చట్టాలు మన దేశ నడకకు ప్రాణవాయువు.
రాజ్యాంగం మన దేశ గమనానికి చైతన్య శక్తి, చోదక శక్తి.
దేశంలో అంతర్గతంగా జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పాలన చేయాల్సింది ప్రభుత్వాలు. ఈ ప్రభుత్వాలపై సూపర్ శక్తులుగా తమను తాము భావించుకుంటున్న కొందరు ఇస్తున్న తీర్పులు మన దేశ పాలనా వ్యవస్థను ఒడిదుడుకులకు గురి చేయడం లేదా?

**● తీర్పులు ఇచ్చేది కోర్టులు మాత్రమేనా? తీర్పుల్లో న్యాయమూర్తుల పాత్ర ఏమిటి?**

**సల్వా జుడుం ను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది సుప్రీంకోర్టు, అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అంటున్నారు.**
**సుప్రీం కోర్ట్ అంటే ఏమిటి?.**
**సుప్రీం కోర్ట్ అంటే,**
**న్యాయమూర్తులు, రాజ్యాంగ ధర్మాసన పీఠం కాదా?**
**జ్యూడిషియల్ బెంచ్ అని ఏర్పాటు చేసుకునే ధర్మాసనాల్లో ఉండేది ఎవరు?.**
**న్యాయమూర్తులుగా పీఠాన్ని అలంకరించే వ్యక్తులే కదా!.**

జస్టిస్ సుదర్శన్ రెడ్డి గనుక ఈ మాటపై నిలబడితే, మరి ఈ సూత్రం ప్రకారం ప్రభుత్వ అధినేతల వ్యవహారాన్ని ప్రశ్నించే అధికారం కూడా ఎవ్వరికీ లేదు.
రాష్ట్ర ప్రభుత్వం అయినా, కేంద్ర ప్రభుత్వమైనా చేస్తున్న చట్టాలకు, జరుపుతున్న పాలన కు కారణం ఎవరు?.

**– జస్టిస్ సుదర్శన్ రెడ్డి వాదన గనుక నిజమైతే, అసలు ప్రభుత్వ అధినేతలను విమర్శించడం కుదరదు. ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు, ఆయా మంత్రి వర్గాలు తీసుకునే నిర్ణయాలు పూర్తిగా ప్రభుత్వానికి మాత్రమే చెందుతాయి.వ్యక్తులుగా ఎవరిని విమర్శించకూడదు**

**జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారి వాదన ఇదేనా?.**
జస్టిస్ సుదర్శన్ రెడ్డి వాదనలోని ద్వంద్వ ప్రమాణాలు, పక్షపాత విమర్శలు ప్రజాస్వామ్యవాదులు ఎవ్వరు కూడా హర్షించరు.ఎన్.డి.ఏ ప్రకటించిన ఉపరాష్ట్రపతి అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్ అచ్చంగా ఆర్ఎస్ఎస్ మనిషి అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి 23 ఆగస్టు రోజున చేసిన బహిరంగ ప్రకటన ఆక్షేపనీయం.

**– ఆర్ఎస్ఎస్ భావజాలానికి నేను చాలా దూరం అంటూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రకటించుకోవడం అసహనవాదం,intolerance •**

**దేశ ప్రజలపై ఆర్ఎస్ఎస్ ప్రభావాన్ని జస్టిస్ సుదర్శన్ రెడ్డి కాదనగలరా?..**
కమ్యూనిస్టులు, నక్సలైట్లు యదేచ్ఛగా తమ సిద్ధాంతాలను ఆచరించే స్వేచ్ఛ అధికారం రాజ్యాంగం ప్రకారం నిజమే అయితే, ఈ సూత్రం ఆర్ఎస్ఎస్ కు వర్తించదా?.జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని అనుసరించాలని ఎవరు కోరారు?.అతడు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను వ్యతిరేకిస్తున్నానని ప్రకటించడం ఆర్ఎస్ఎస్ రాజ్యాంగ హక్కులకు వ్యతిరేకం కాదా?..
మన దేశ రాజ్యాంగం అన్ని రకాల భావజాలాలను స్వాగతిస్తుంది.

**– మరి ఒక న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆర్ఎస్ఎస్ భావజాలానికి దూరం, వ్యతిరేకం అని ప్రకటించుకోవడం ఉదార వాదం ఎలా అవుతుంది?.**

ఉదారవాదం అంటే అసహన వాదమేనా?
**వీరు ఉప రాష్ట్రపతి గా కనుక ఎన్నికైతే ఆర్ఎస్ఎస్ భావజాల వ్యక్తులను సభలో నియంత్రిస్తారు కదా!..ఇది భిన్నాభిప్రాయాన్ని, dissent ను అనుమతించే రాజ్యాంగ హక్కులకు వ్యతిరేకం కదా!**

ఈ దేశం ఇప్పుడు నిజంగా "రాజ్యాంగ వ్యతిరేక కుట్ర దారుల కబంధహస్తాల" నుంచి విముక్తం కావాల్సిన సమయం.


**– జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రకటనలోని భిన్న కోణాలను, పాక్షిక వాదనలను సభ్య సమాజం మేధావులు ఖండించాల్సిన సమయం ఇది**

నిన్న ప్రముఖ దినపత్రికలలో, అన్ని ఎలక్ట్రానిక్ మీడియాలలో, సోషల్ మీడియాలలో జస్టిస్ సుదర్శన రెడ్డి ప్రకటన స్పష్టంగా ప్రచురితమైంది, ప్రసారమైంది.భోపాల్ విషవాయువుల కేసులో, సల్వా జుడుం కేసులో వెలువరించిన తీర్పులు తనవి కావట!.అవి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులంట!. జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడిన తీరు హాస్యాస్పదం, లోతైన కుట్ర పూరితం అని ప్రజలందరూ భావిస్తారని తెలియదా?.ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేది రాజకీయ పార్టీలు కాదు. గౌరవ పార్లమెంటు సభ్యులట!.ఈ పార్లమెంటు రాజ్యసభ ఎంపీలు ఏ పార్టీకి చెందినవారు కాదట. వారంతా ఎలక్ట్రోరల్ కాలేజీకి చెందిన వారట!.

**● న్యాయమూర్తులు ఇచ్చే తీర్పు సుప్రీంకోర్టుకు చెందినవి అని అన్నప్పుడు, ఎంపీలు వేసే ఓట్లు ఆయా రాజకీయ పార్టీలకు చెందినవి అవుతాయి కదా**

ఈ మాత్రం సామాన్య విషయం ప్రజలు అర్థం చేసుకోలేరా?.ఎన్డీఏ అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ఆర్ఎస్ఎస్ భావజాలానికి చెందినవాడైనప్పుడు, జస్టిస్ సుదర్శన్ రెడ్డి అర్బన్ నక్సలైట్ భావజాలానికి చెందినవాడు అని విమర్శలు రావడం సహజం కదా!.జస్టిస్ సుదర్శన్ రెడ్డితో ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నప్పుడు పక్కన నిలుచున్నది ఎవరు?. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ,కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తో పాటు ఇండీ కూటమికి చెందిన రాజకీయ పార్టీల వ్యక్తులు కాదా?..


IN THE SUPREME COURT OF INDIA
CIVIL ORIGINAL JURISDICTION
WRIT PETITION (CIVIL) NO. 250 OF 2007
Nandini Sundar and Ors. ...Petitioners
Versus
State of Chattisgarh ...Respondent
ORDER
జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పు కొరకు క్రింద ఉన్న ఈ లింక్ గూగుల్ లో టైప్ చేయండి
https://api.sci.gov.in/jonew/judis/38160.pdf


THE NEW INDIAN EXPRESS
Nation
SC refuses to reopen Bhopal gas tragedy case
The CBI had filed a curative plea, seeking court direction to frame charges against the accused for culpable homicide.

The unanimous order was passed by the bench that included justices Altamas Kabir, R V Raveendran, B Sudershan Reddy and Aftab Alam.
వేలాది మందిని చంపి, లక్షలాది మందిని జీవచ్ఛవాలుగా మార్చిన భోపాల్ విషవాయువు బాధితుల రోధన ఏ భావజాలం ఖాతాలో వేయాలి?
kushagra_gaur03 Anderson killed 25,000 Indians in the Bhopal Gas Tragedy. Rajiv Gandhi helped him escape from India. When CBI appealed to reopen the case, Justice B. Sudershan Reddy refused. Now he is Sonia Gandhi's Vice President candidate.

**● జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నప్పుడు, సిపి రాధాకృష్ణన్ స్వతంత్ర అభ్యర్థి కాదా?**

రాష్ట్ర గవర్నర్లైనా, ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి అయిన ఒకసారి ఎన్నుకోబడిన తరువాత వారంతా నిష్పాక్షిక విధులు నిర్వహిస్తారు.ఎన్డీఏ అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన తరువాత వారిని ఆర్ఎస్ఎస్ ప్రతినిధి అని సుదర్శన్ రెడ్డి గారు అనగలరా?.జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు సిపి రాధాకృష్ణన్ ను ఆర్ఎస్ఎస్ భావజాల వ్యక్తి అని ప్రకటించడం ఒక న్యాయమూర్తి స్థాయిని కించపరచినట్టుగానే ఉంది. సిపి రాధాకృష్ణన్ ను బహిరంగంగా ఆర్ఎస్ఎస్ వ్యక్తి అని పలికే స్వేచ్ఛ జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారికి ఉన్నప్పుడు, వారిని కూడా లెఫ్ట్ లిబరల్ భావజాలం కలిగిన వ్యక్తి అని విమర్శలు రావడం సహజం.గతంలో కాంగ్రెస్ పాలనలో పనిచేసిన గవర్నర్లు, ఉపరాష్ట్రపతులు, రాష్ట్రపతులు స్వతంత్రంగా పని చేయలేదా?.ఏమిటిది ?. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు ప్రజల ఆలోచనా శక్తిని తక్కువగా అంచనా వేస్తున్నారా? హైకోర్టుల్లో, సుప్రీంకోర్టులో తీర్పులు ఇచ్చేది పుస్తకాలు కాదు. ఆ చట్టాల రాజ్యాంగ స్ఫూర్తిని తీర్పులుగా ప్రకటించేది న్యాయమూర్తులు. న్యాయమూర్తుల కూడా వ్యక్తులే.ఒక వ్యక్తిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి వ్యవహార శైలిని ప్రశ్నించే అధికారం భారత పౌరులందరికీ ఉంది.యూనియన్ కార్బైడ్ కేసులో, సల్వాజుడుం కేసులో తీర్పులు వెలువరించిన న్యాయ పీఠాల్లో ఒకడిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి తన వ్యక్తిగత బాధ్యతను వ్యవస్థ పై వేసి తప్పించుకోవచ్చా?.అలా అయితే ముఖ్యమంత్రులు,ప్రధాన మంత్రులు,మంత్రివర్గ సభ్యులు కూడా అలాగే తప్పించుకుంటారు.సుప్రీంకోర్టు న్యాయ పీఠంపై రాజ్యాంగ పుస్తకాన్ని ఉంచితే సరిపోతుంది కదా!. ఆ రాజ్యాంగ పుస్తకం తనకు తానే తీర్పులు ఇవ్వచ్చు కదా!. మరి న్యాయమూర్తుల అవసరమేమిటి?

**● ఈ ఉపరాష్ట్రపతి అభ్యర్థుల ఎన్నిక వ్యక్తిత్వాల పరిచయాన్ని చేస్తున్నది**

ఎన్డీఏ అభ్యర్థి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ తన జీవితకాలంలో ఏమైనా పొరపాట్లు చేస్తే తప్పులు చేస్తే బహిరంగంగా ప్రశ్నించే అధికారం ప్రతి ఒక్కరికి ఉంది.

**– అదేవిధంగా ఇండికూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి వ్యవహార శైలిని చరిత్రను ప్రశ్నించే అధికారం ప్రతి భారతీయుడికీ ఉంది**

జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆర్ఎస్ఎస్ వ్యతిరేకి అని తనకు తానే ఒక పక్షం వైపు కదిలిపోయాడు. తను ఉదార రాజ్యాంగ ప్రజాస్వామ్య వాదినంటూ ఒక లేబుల్ తగిలించుకుంటున్నాడు.

**ఈ పదాల గారడి కి కాలం చెల్లింది.**

## – ఏ వ్యక్తికైనా తన ప్రవర్తన తన రాజ్యాంగం

ప్రతి వ్యక్తి ప్రవర్తన సమాజంలో అతని వ్యక్తిత్వాన్ని పట్టి చూపుతుంది.జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండీ కూటమి తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడం ఒకరకంగా మంచిదే అయింది. ఉపరాష్ట్రపతి అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని తెలియజేస్తున్నది.అనంతమైన ఈ కాల ప్రవాహంలో వ్యక్తులే తమ శీల ప్రదర్శనతో ఉన్నత ఆదర్శాలను నెలకొల్పుతారు. ఉన్నత సమాజాన్ని, ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మిస్తారు.జస్టిస్ సుదర్శన్ రెడ్డి తను ఆర్ఎస్ఎస్ వ్యతిరేకిని అని ప్రకటించుకోవడం మంచిదే అయింది.అతనెవరో తెలిసిపోయింది.
జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇప్పుడు తన జీవిత చరమాంకం లో తన మార్మిక వ్యక్తిత్వాన్ని బయటపెట్టుకున్నాడు.ఇక అసలు విషయానికి వస్తే.. ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ఎన్నిక నిశ్చితమైపోయింది. ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవాల్సిన ఎలక్ట్రోరల్ కాలేజీ సభ్యుల సంఖ్య రాధాకృష్ణన్ గారికి అనుకూలంగా ఉంది.రాధాకృష్ణన్ ను ఎన్నుకునే ఎలక్ట్రికల్ కాలేజీకి చెందిన ప్రతి ఎంపీకి ఒక పార్టీ ఉంది.అందులో మెజారిటీ పార్లమెంటు సభ్యులు బిజెపికి చెందినవారు ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారు.

**– జస్టిస్ సుదర్శన్ రెడ్డి కి ఓటు వేసే ఉదార రాజ్యాంగ ప్రజాస్వామ్య వాదుల సంఖ్య తేలిపోతుంది**

బిజెపి ఎన్డీఏ వ్యతిరేకతతో అమాయకంగా ఓట్లు వేసే సభ్యుల సంఖ్య కూడా తేలిపోతుంది.ఈ పరిణామం భవిష్యత్తులో సైద్ధాంతిక ధ్రువాలను బలపరుస్తుంది.భోపాల్ గ్యాస్ మారణ హోమాన్ని కప్పి పెట్టిన కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు, వాటి ఉమ్మడి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారి వ్యక్తిత్వ పరిచయం ఈ ఎంపిక ద్వారా జరిగిపోయింది.
జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు చెప్పిన దాని ప్రకారము ఇది రెండు భావజాలాల మధ్య పోటీ.మన దేశం ఇప్పుడు రెండు భావజాల ధ్రువాల వైపు కదులుతున్నది. ఉదార రాజ్యాంగ ప్రజాస్వామ్య వాదులుగా చెప్పుకుంటున్న అన్ని రకాల శక్తులు అనివార్యంగా ఒక వైపు చేరిపోతున్నారు. ముసుగులు తొలగుతున్నాయి. రహస్య ఎజెండాలు బయటపడుతున్నాయి.

**● ఈ దేశాన్ని ప్రేమించే వారు ఒకవైపు. ఉదార రాజ్యాంగ ప్రజాస్వామ్య వాదం అని ప్రకటించే వారు ఒకవైపు**

ప్రపంచ దేశాలన్నీ ఇప్పుడు పక్కాగా జాతీయవాద దృక్పథం తో పనిచేస్తున్నాయి.
కమ్యూనిజానికి కాలం చెల్లింది. కమ్యూనలిజమ్ గా పిలవ బడే మత వాదం ఇప్పుడు ప్రపంచాన్ని పట్టి కుదుపుతున్నది.ఉదార రాజ్యాంగ ప్రజాస్వామ్య వాదానికి ప్రతినిధిగా తనకు తాను ప్రకటించుకోవడం వల్ల జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు తన విమర్శకుల పని సులువు చేసారు.తన పోటీ ద్వారా జాతీయవాదాన్ని ... ఉదార రాజ్యాంగ ప్రజాస్వామ్య వాదం మధ్యన గల భేదాన్ని భారతీయులకు స్పష్టంగా అర్థం చేయిస్తున్నాడు.బిజెపి యేతర పార్టీలు దేశ ఔన్నత్యాన్ని, మన సంస్కృతీ నాగరికతలను చులకనగా చూస్తూ ప్రవర్తిస్తున్న తీరును ఈ దేశ ప్రజలు ఏవగించుకుంటున్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు ఈ గుంపులో ఉన్నట్టుగా సామాన్యునికి కూడా అర్థం అయ్యింది.

**● అనంత కాలగమనంలో మబ్బులు పట్టిన మన దేశ ఔన్నత్యం మళ్లీ వెలుగులీనుతున్న సమయం ఇది**

సుదర్శన్ రెడ్డి గారికి ఈ పోటీ వల్ల తన 79 సంవత్సరాల జీవితంలోని ఆదర్శాలు సైద్ధాంతిక చరిత్ర, ముఖ్యంగా న్యాయ చరిత్ర మొత్తాన్ని అవలోకనం చేసుకునే సమయం జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారికి కలిగింది.జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు ఇకముందు తన భావజాలంపై, దేశ పరిణామాలపై అంతర్మథనం చేసుకునే అవకాశాన్ని కల్పించిన ఇండి కూటమికి ధన్యవాదాలు.

# శివాజీ నగర్ బట్టల షాపులు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ కు తరలింపు..

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ని గోదావరిఖని పట్టణంలో వస్త్ర ముతా వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బట్టల షాపులను దాదాపు 40 సంవత్సరాలకు పైగా నడిపిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో చిన్నగా వ్యాపారాలను వారు ప్రారంభించడం జరిగింది. గతంలో పాత కూరగాయలం మార్కెట్ ఉన్న సందర్భంలో ప్రస్తుతం ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ కు వెనుక వైపు తమ వ్యాపారాలను కొనసాగించేవారు. రోడ్డు వెడల్పులో భాగంగా వారిని ఖాళీ చేయించారు. దాంతో శివాజీ నగర్ సింగరేణి క్వార్టర్ల పరిధిలో ఉన్న రోడ్డుకు ఇరువైపులా చిన్న షెటర్లను కిరాయి కి తీసుకొని తమ వ్యాపార లావాదేవీలను కొనసాగిస్తూ ఉన్నారు. చాలా ఏళ్ల నుంచి గోదావరిఖని పట్టణంలోని వినియోగదారులకు వారికి చాలా మంచి సత్సంబంధాలు నెలకొని ఉన్నాయి. పాత ఖాతాదారులు షాపు వద్దకు వచ్చి కొనుగోలు చేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. సామాన్య వినియోగదారునికి



అందుబాటులో కూడా వీరి ధరలు ఉండడంతో ఎక్కువగా ఈ షాపులకు వచ్చి కొనుగోలు చేసేందుకు వారు ఇష్టపడుతూ ఉంటారు. గతంలోనే రోడ్డు వెడల్పులో భాగంగా శివాజీ నగర్ మార్కెట్ కు వచ్చిన వీరికి మరొకసారి షాప్ లో మార్చే పరిస్థితి తలెత్తాయి. అయినా మొక్కవోని ధైర్యంతో షాపులను తరలించడానికి వారు సుముఖత వ్యక్తపరిచారు. ప్రస్తుతం వారు నిర్వహిస్తున్న షాపుల ఏరియాలో మళ్ళీ వాణిజ్య సముదాయాలు నిర్మించడంతో వారు మారక తప్పని పరిస్థితి



నెలకొంది. దీంతో షాపులు ఎక్కడ పెట్టుకోవాలని సందిగ్ధంలో ఉన్నప్పుడు ఈ వ్యాపారులు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ను వీరు కలవడం జరిగింది. చాలా రోజుల నుండి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వృధాగా మారడంతో వస్త్ర మూట వ్యాపారులు తమ దుకాణాలను షాపింగ్ కాంప్లెక్స్ లో నిర్వహించుకోవడానికి అనుమతిచ్చారు. దాంతో అస్తవ్యస్తంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ను కొంత మేరకు మరమ్మత్తులు చేసుకొని తమ వ్యాపారులను కొనసాగించడం జరుగుతుంది. వీరికి మద్దత్తుగా ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్ వచ్చి వీరి షాప్ లను ప్రారంభించారు. ఇది ఇలా ఉండగా షాపింగ్ కాంప్లెక్స్ ముందు ఉన్న అక్రమ కట్టడాలను కూడా తొలగించడంతో షాపింగ్ కాంప్లెక్స్ కాస్త బయటకు కనబడడానికి అవకాశం ఏర్పడింది. దాదాపు 26 షాపులను ఈ వస్త్ర ముతా వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. షాపుల నిర్వాహకులు కాంతి కోసం లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో రాత్రి వేళలో వస్త్ర వ్యాపార దుకాణాలు మిరుమిట్లు గొలిపే విధంగా కనిపిస్తూ ఈ షాపింగ్ కాంప్లెక్స్ కే కళ తెచ్చినట్లుగా కనబడుతోంది. కాగా శివాజీ నగర్ నుండి తమ వస్త్ర వ్యాపార దుకాణాలను మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసుకున్నామని, వినియోగదారులు మాకు సహకరించి ఈ షాపింగ్ కాంప్లెక్స్ వచ్చి యధావిధిగా విచ్చేసి బట్టలు కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు. తమ పాత పరిచయస్తులు వినియోగదారులతో పాటు కొత్తగా కూడా వినియోగదారులు వచ్చి తమ దగ్గర కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.

## బాయర్ కంపెనీ నూతన ఉత్పాదన బికోటా ఆవిష్కరణ



**కరపత్రం ప్రతినిధి నర్సంపేట:**

నర్సంపేటలోని రెడ్డి ఫంక్షన్ హాల్ ఆవరణలో బాయర్ కంపెనీ ఆధ్వర్యంలో నూతన ఉత్పాదన బికోటాను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మరియు బాయర్ కంపెనీ ప్రతినిధులు హితేష్ శర్మ, శ్రవణ్ కుమార్, అశోక్ రెడ్డి, విక్రమ్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాగుర్ల వెంకటేశ్వర్లు మరియు కంపెనీ ప్రతినిధులు బాయర్ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ... బికోటా గుళికల మందును వరి పొలంలో నాటు వేసిన 15 నుండి 25 రోజుల మధ్యలో వాడుకోవాలని, దీని వాడకంతో వరి పంటను మోగి పురుగు మరియు ఉల్లికోడు (రాగి గొట్టం) నుండి సమర్థవంతంగా రక్షించుకోవచ్చని తెలిపారు.ఫలితంగా పంటలో అధిక పిలకలు పెరిగి, పచ్చగా వృద్ధి చెంది, రైతులకు ఎక్కువ దిగుబడి అందిస్తుందని వివరించారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సుమారు 30 గ్రామాల నుండి 800 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సతీష్, డిస్ట్రిబ్యూటర్ నరేంద్ర కుమార్ మరియు నర్సంపేట డీలర్లు పాల్గొన్నారు.

## నాచారం మల్లాపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న రహేజా విస్ట అపార్ట్మెంట్స్ సందర్శించిన ఈటలరాజేందర్

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి నాచారం ఆగస్టు 24**

నాచారం మల్లాపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న రహేజా విష్ట అపార్ట్మెంట్లో నివాసం ఉంటున్న వారితో సమావేశమైన ఎంపీ ఈటల రాజేందర్.పలు సమస్యలు పరిష్కారం చేయాలంటూ నిన్న కొంతమంది అపార్ట్మెంట్ వారు వచ్చి ఎంపీని కలిశారు. మీ దగ్గరికి వస్త అని చెప్పి ఈరోజు వచ్చారు.టీఎస్ఐఐసీ పరిధిలో ఆరెంజ్ జోన్ లో ఉన్న అపార్ట్మెంట్ ను జిహెచ్ఎంసి రెసిడెన్షియల్ పరిధిలోకి తీసుకురావాలని, మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీ ఈటల ను కోరిన అపార్ట్మెంట్ వాసులు. సానుకూలంగా స్పందించిన ఈటల రాజేందర్ వారితో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో స్వయంగా తాను ఇక్కడికి రాకున్నా గొప్పగా గెలిపించారని అందరికీ కృతజ్ఞతలు



తెలిపారు.నాకు శాతం ఓట్ల వచ్చాయి. 10 లక్షల ఓట్లు వేసి 4 లక్షల మెజారిటీతో గెలిపించారు. నేను చాలా అదృష్టవంతుణ్ణి.

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం మినీ ఇండియా.





ఇక్కడ తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన వారు మాత్రమే కాదు, దేశంలో ప్రతి రాష్ట్రం నుండి వచ్చిన వారు ఉన్నారు. 70 లక్షల జనాభా ఉంది. అందుకే గెలిచినప్పటి నుండి ప్రతి రోజు నియోజకవర్గంలో తిరుగుతూనే ఉన్నానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని వారితో అన్నారు.

## సెప్టెంబర్ 2న చలో కొత్తగూడెంను విజయవంతం చేయండి

**- టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య**

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 24:**

సెప్టెంబర్ 2న చలో కొత్తగూడెంను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు గోదావరిఖనిలోని టీబీజీకెఎస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు హామీలను మరచి యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ కార్మిక సమస్యలను గాలికి వదిలేసుందన్నారు. కార్మికుల కనీస రోజు వారి సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదని, కొత్త హక్కులను సాధించడం మరచి ఉన్న హక్కులను కూడా తాకట్టు పెట్టే పరిస్థితి దాపురించిందన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దశలవారి ఆందోళన కార్యక్రమాలు చేపట్టామని, ఈ నెల 28న బొగ్గు గనులపై నల్ల బ్యాడ్జీలు ధరించి





హెచ్ఓడీలకు వినతి పత్రాలు, 29న అన్ని ఏరియాల జిఎంలకు వినతి పత్రాలు, సెప్టెంబర్ 2న సాయంత్రం 3.30 గంటలకు కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. వాస్తవ లాభాలపై 35 శాతం వాటాను ప్రకటించాలని, కార్మికులకు ఆదాయపుపన్నును రద్దు చేయాలని, అలవెన్స్ లపై ఆదాయపన్నును యాజమాన్యమే చెల్లించాలని, అనారోగ్య సమస్య లతో మెడికల్ బోర్డ్ కి వెళ్లే కార్మికులందరిని అన్ ఫిట్ చేయాలని, 24 నెలల సర్వీస్ కాల పరిమితిని 36 నెలలకు పెంచాలని, జూలై నెలలో ఫిట్ ఫర్ సేమ్ జాబ్ పంపిన 50 మంది ఉద్యోగులను తిరిగి మెడికల్ బోర్డుకు పిలిచి వారందరిని అన్ ఫిట్ (ఇన్వాలిడేషన్) చేయాలని, వేలం పాటతో సంబంధం లేకుండా సింగరేణికి నూతన బొగ్గుగనులు కేటాయించాలని, సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన 43 వేల కోట్ల రూపాయల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కొత్త ట్రాన్స్ఫర్ పాలసీని రద్దు చేయాలని, ట్రాన్స్ఫర్ పాలసీ పారదర్శకంగా ఉండేలా చూడాలని, మెడికల్,ట్రైనింగ్ పూర్తి చేసుకున్న డిపెండెంట్ లకు వెంటనే నియామక పత్రాలు ఇవ్వాలని, 35 సంవత్సరాల నుండి 40 ఏళ్లకు వయసు పరిమితిని పెంచిన యాజమాన్యం వారిలో 10వ తరగతి సర్టిఫికేట్ లేని వారిని విజిలెన్స్ కు పంపడాన్ని నిలిపివేసి వారికి వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో టీబిజికెస్ అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్, కేంద్ర నాయకులు జావిద్ పాష, చెల్పూరి సతీష్, పొలాడి శ్రీనివాసరావు, దూట శేషగిరి, బ్రాంచ్ నాయకులు కోంఢ్ర అంజయ్య, కలదర్ రెడ్డి, మాసాడి సాయి చరణ్,పిట్ సెక్రటరీలు జనగామ మల్లేష్, అడ్డగట్ల గోపి, పులిపాక శంకర్, అప్సర్ పాషా, మురళి, రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్టూనిస్టు శంకు మృతి పట్ల మేజిక్ రాజా దిగ్భ్రాంతి



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 24:**

తెలుగునాట ప్రముఖ సీనియర్ కార్టూనిస్టు శంకు ఆకస్మిక మృతి పట్ల స్థానిక ప్రముఖ కళాకారులు మేజిక్ రాజా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మృతి కళా, సాహితీ రంగాలకు తీరనిలోటన్నారు. గత నవంబర్ లో హైదారాబాద్ లో ఆయనతో గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. శంకు కేవలం కార్టూనిస్ట్ మాత్రమేగాక మంచి చిత్రకారుడు, రచయిత, డాక్యుమెంటరీ, ధారావాహికల దర్శకులు, బహుముఖ ప్రజ్ఞాశాలియని పేర్కొన్నారు. బాపు, ఆర్కే లక్ష్మణ్, శంకర్ పిళ్ళై, మారియో మిరాండా వంటి హేమాహేమీలపై డాక్యుమెంటరీలు, రావు బాలసరస్వతీ దేవి, మల్లు స్వరాజ్యం, పాలగుమ్మి విశ్వనాథం, కాపు రాజయ్య, వెంపటి చిన సత్యంలపై 'తెలుగు వెలుగులు', శంకరమంచి సత్యం 'అమరావతి కథలు', అలనాటి హాస్యరచయిత మునిమాణిక్యం నరసింహా రావు 'కాంతం కథలు', వంశీ వ్రాసిన 'మా పసలపూడి కథలు', సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత సలీం రచనల ఆధారంగా 'సలీం కథలు' నిర్మించి, దర్శకత్వం వహించి 6 నంది అవార్డులు అందుకున్నారని పేర్కొన్నారు. ఆయన మృతికి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ - కార్యాచరణ సమావేశం

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి కరీంనగర్ జిల్లా ఆగస్టు 24**

సమాచార హక్కు చట్టం - 2005 అమలులోకి వచ్చిన 20 సంవత్సరాల సందర్భంగా, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో సంయుక్త కార్యాచరణ సమావేశం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ( ఆర్.టి.ఐ ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డా. చంటి మదిరాజ్ - వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షులు, సూర స్రవంతి - రాష్ట్ర అధ్యక్షులు, మల్లం వెంకటేష్ గౌడ్ - ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు. సమావేశంలో సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు లభించే హక్కులు, అధికారులు పారదర్శకతతో వ్యవహరించాల్సిన విధానం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆర్టిఐ ప్రాధాన్యత వంటి



అంశాలపై విస్తృత చర్చ నిర్వహించారు.ప్రజా ప్రతినిధులు, సంఘ నాయకులు, సామాజిక కార్యకర్తలు కూడా సమావేశంలో పాల్గొని, సమాచార హక్కు చట్టం మరింత బలోపేతం కావడానికి తీసుకోవలసిన చర్యలను సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు చెరుకు పైడయ్య, ఉపాధ్యక్షులు ఇమ్మడి భరత్ కుమార్, కొమ్మెర మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శులు దాట్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.